## క్లుప్తంగా

### మానవతా సంస్థకు రూ.లక్ష విరాళం



సత్యనారాయణను సన్మానిస్తున్న సంస్థ సభ్యులు

**దేవరపల్లి:** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ దేవరపల్లి మండల శాఖకు దేవరపల్లికి చెందిన జ్యేష్ఠ వెంకటేశ్వరరావు, సత్యనారాయణ సోదరులు రూ.లక్ష విరాళం అందజేశారు. వీరి తల్లిదండ్రులు రంగారావు, పాపాయమ్మ దంపతులు జ్ఞాపకార్థం శాంతి రథం నిర్వహణకు విరాళం అందజేశారు. విరాళాన్ని సంస్థ మండల అధ్యక్షుడు ఈడ్పుగంటి నాగేశ్వరరావుకు అందజేశారు. ఈ సందర్భంగా దాతలు వెంకటేశ్వరరావు, సత్యనారాయణ సోదరులను సంస్థ ద్వారా సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సస్థ రాష్ట్ర కార్యదర్శి బలుసు సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

### పరిశుభ్రతపై అవగాహన

**గోపాలపురం:** పరిసరాల పరిశుభ్రతతో పాటు విద్యార్థుల వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని హెచ్‌ఎం కె.రవి కాంత్ అన్నారు. పెద్దాపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.రాజు, సీఆర్‌పీ కొయ్య నాగరాజు ఉన్నారు.

### అప్పారావుకు నివాళులు

**పెరవలి:** గ్రంథాలయం అభివృద్ధికి బాట వేయడంతోపాటు స్థలం, భవనాన్ని నిర్మించి ఇచ్చిన దాత ఇనపకోళ్ల అప్పారావుకు శుక్రవారం ఘనంగా నివాళులర్పించారు. పెరవలి మండలం ముక్కామల శాఖా గ్రంథాలయంలో ఇనపకోళ్ల అప్పారావు 97వ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటి అధ్యక్షులు కడియాల సాయిరామారావు, కరుటూరి విశ్వనాథం, సలాది సూర్యనారాయణ గ్రంథపాలకుడు వెంకటేశ్వర్లు, అక్కిన బలరాం, మద్దిపాటి సూర్యరావు కరుటూరి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### నల్ల బ్యాడ్జీలతో నిరసన

**తాళ్లపూడి:** సీపీఎస్ ఉద్యోగులకు సెప్టెంబర్-1 చీకటి రోజని ఆ రోజే పాత పెన్షన్ రద్దు చేసి నూతన కాంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం అమలులోకి తీసుకువచ్చారని ఏఎస్‌ఓ జె.వెంకటేశ్వరరావు అన్నారు. తాళ్లపూడిలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలోని పాలకులకు అమలు చేస్తున్న పింఛను ఉద్యోగులకు ఎందుకు అమలు కాదని ప్రశ్నించారు. ఇప్పటి ప్రభుత్వం జీపీఎస్ విధానం మంచిది అంటున్నారని అవన్నీ పాత పెన్షన్‌తో సమానం అని అంటున్నప్పుడు పాత పెన్షన్ విధానమే అమలు చేయవచ్చుకదా అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది దీపక్, మరణమ్మ, భాగ్యలక్ష్మి, సురేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతకు పెద్దపీట

- హోమ్ మంత్రి తానేటి వనిత
- పట్టణంలోని 13, 17 వార్డుల్లో గడప గడపకూ మన ప్రభుత్వం

**కొవ్వూరు:** మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని రాష్ట్ర హోమ్ మంత్రి తానేటి వనిత పేర్కొన్నారు. పట్టణంలో 13, 17వ వార్డులో శుక్రవారం రాత్రి నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నీ సంక్షేమ పథకాలు మహిళల పేరుతో అందిస్తూ వారి ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్నారని అన్నారు. ఇంటింటికీ వెళ్లి గడచిన నాలుగేళ్ల పాలనలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాల లబ్ధిని గురించి వివరించారు. అందరికీ ఆప్యాయంగా పలకరించుకుంటూ, సమస్యలు అడిగి తెలుసుకుంటూ ముందుకి సాగారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్ పర్సన్ మన్నె పద్మ, గంద్రోతు అంజనీదేవి, స్థానిక వార్డు ఇన్‌చార్జి ఏలూరి వెంకట్, పట్టణ పార్టీ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, జెడ్పీ వైస్ చైర్ పర్సన్ పోసిన శ్రీలేఖ, మాజీ ఏఎంసీ చైర్మన్లు బండి పట్టాభిరామారావు, వల్లభశెట్టి గంగాధర శ్రీనివాస్, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు సలాది సందీప్‌కుమార్, దొమ్మేరు సొసైటీ అధ్యక్షుడు ముదునూరి సూర్యనారాయణరాజు, నాయకులు దేవగుప్తాపు లక్ష్మణరావు, బత్తి నాగ రాజు,వరిగేటి సుధాకర్, చిట్టూరి అన్నవరం,తోట రామకృష్ణ, సిద్దన వాసు, స్థానిక కౌన్సిలర్‌లు తోట లక్ష్మి ప్రసన్న, దేవగుప్తాపు చాందిని, మద్దిపట్ల సాయి గీత, చీరా అరుణకుమారి, వరిగేటి లలిత కుమారి, అంకోలు వెంకట లీల్లి పద్మలీల తదితరులు పాల్గొన్నారు.



పట్టణంలోని 17వార్డులో పథకాలను వివరిస్తున్న హోమ్ మంత్రి వనిత



పెండ్యాల గ్రామంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

**నవరత్నాలతో పేదింట్లో వెలుగులు**

**నిడదవోలు రూరల్:** రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న నవరత్నాలు పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు వెలుగులు నింపుతున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలోని పెండ్యాల గ్రామంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమాన్ని రెండోరోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కారింకి అన్నవరం, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు ఉప్పులూరి రామకృష్ణాంజనేయులు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, గ్రామంలో నాలుగున్నరేళ్లుగా చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించి బుక్‌లెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికి రూ.లక్షల్లో సంక్షేమ లబ్ధి అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. పేదల పక్షాన ఉన్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో తోడుగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, మాజీ ఎంపీపీ మన్యం సూరిబాబు, జేసీఎస్ కన్వీనర్ వెలగన పోలయ్య, పార్టీ రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, ఉపసర్పంచ్ బైర్రాజు సత్యరాజు, నాయుడు సత్యనారాయణ, పేరిచర్ల నాగరాజు, వాకా సూర్యనారాయణ, సరిపల్లి నూకరాజు, ఊబా శ్రీను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సర్పంచ్ జ్యోతి

**నల్లజర్ల:** పోషకాహారంతోనే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నల్లజర్ల సర్పంచ్ పల్లి జ్యోతి అన్నారు. పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా నల్లజర్ల అంగన్‌వాడీ కేంద్రం-4లో శుక్రవారం పౌష్టికాహారం-ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన పెరట్లో పెంచుకునే తాజా కూరగాయలే పౌష్టికాహారమని, వాటిని నిర్లక్ష్యం చేయడంతో చాలా మంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారన్నారు. కూరగాయులు, ఆకుకూరలలో సూక్ష్మపోషకాలైన విటమిన్లు, ఖనిజాలు లభిస్తాయన్నారు. వాటితో ఆరోగ్యం లభిస్తుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మీ ఇళ్లకే అందించే పౌష్టికాహారాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, వైద్య, ఆరోగ్యసిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

**గోపాలపురంలో..**

**గోపాలపురం:** తల్లీబిడ్డా ఆరోగ్యంగా ఉండాలన్న సంకల్పంతోనే ప్రభుత్వం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందిస్తోందని సీడీపీఓ వైబీటీ సుందరి అన్నారు. గోపాలపురం పెద్దగూడెం ఎంపీయూపీ స్కూల్ వద్ద శుక్రవారం పోషణ మహోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు వారా సంగీత, హెచ్‌ఎం టి వి సత్యనారాయణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఆశా అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇంటి ముంగిటకొచ్చి.. పింఛన్లు అందించి..

- ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు
- 84 మందికి నూతన పింఛను అందజేత

**నిడదవోలు:** తెలతెల్లవారి తలుపుతట్టి వలంటీర్లు లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటుతో ప్రజల ఇంటి ముంగిటకు ప్రభుత్వ సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన పట్టణ పరిధిలో మంజూరైన 84 నూతన పింఛన్లను శుక్రవారం ఆయన అవ్వాతాతలకు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ టీడీపీ హయాంలో పింఛన్లు కావాలంటే జన్మభూమి కమిటీల చుట్టూ తిరిగి, లంచాలు చెల్లించాల్సిన దుస్థితి ఉండేదని, ప్రస్తుత ప్రభుత్వంలో పింఛన్ల ఇంటి ముంగిటకు వస్తున్నాయని తెలిపారు. పట్టణంలో మంజూరైన నూతన పింఛన్లతో కలుపుకుని 4,246 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ పింఛను కానుక కింద రూ.1.19 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తుందన్నారు. సాంకేతిక కారణాలతో ఇంకా ఎవరికైనా పింఛను రాకపోతే వాటిని సరిచేసి అర్హత ఉన్న వారందరికి పింఛన్లు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు, వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



పట్టణంలో నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



కె.సావరంలో పింఛన్ల అందజేస్తున్న ఎంపీపీ యల్లారేశ్వరి, జెడ్పీటీసీ భాస్కరరామయ్య

**అర్హతే ప్రామాణికంగా పింఛన్ల పంపిణీ**

**ఉండ్రాజవరం:** అర్హతే ప్రామాణికంగా పింఛన్లు నేరుగా లబ్ధిదారుల ఇంటికి పంపిణీ చేయడం జరుగుతుందని జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య అన్నారు. మండలంలో వేలివెన్ను, చివటం, కె.సావరం, పాలంగి గ్రామాలల్లో నూతనంగా మంజూరైన పింఛన్లను ఆయన ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరితో కలిసి లబ్ధిదారులకు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చివటం సొసైటీ అధ్యక్షుడు కోఠారు సత్యనారాయణ, పాలంగి సొసైటి అధ్యక్షుడు నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, పాలంగి సర్పంచ్ శ్రీనివాసు పాల్గొన్నారు.

**పెరవలి మండలంలో 555 మందికి...**

**పెరవలి:** మండలానికి కొత్తగా 555 పింఛన్లు మంజూరు అయ్యాయని ఎంపీడీఓ దామోదరరావు తెలిపారు. కొత్తగా పింఛన్లు పొందిన లబ్ధిదారులకు ఈనెల 2వ తేదీన అనగా శనివారం రాజశేఖరరెడ్డి వర్ధంతి అందజేస్తారని తెలిపారు.

**నిడదవోలు మండలంలో 387 మందికి..**

**నిడదవోలు రూరల్:** మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో అర్హులైన 387 మంది అర్హులైన లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక మంజూరైనట్టు ఎంపీడీవో పి.శామ్యూల్ తెలిపారు. మండలంలోని సమిశ్రగూడెం, కంసాలిపాలెం, విజ్జేశ్వరం, కాటకోటేశ్వరం గ్రామాల్లో లబ్ధిదారులకు నూతన పెన్షన్ సొమ్ములను ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది అందజేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు కొండపల్లి శ్రీను, తిక్కా శ్రీను, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుంటుపల్లి రామచంద్రరావు, కోసూరి అప్పారావు, గెడ్డం రవీంద్ర, దేశా బత్తుల నాగు, వడలి అంబేడ్కర్ తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయం

సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు శంకుస్థాపన



మూడో వార్డులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

**నిడదవోలు:** పట్టణ పరిధిలో మరిన్ని మౌళిక సదుపాయల కల్పనే ధ్యేయంగా పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలో 02, 03, 25 వార్డులలో మున్సిపల్ సాధారణ నిధులు రూ.32.77 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణాలకు శుక్రవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యాక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు ఎండీ షకిరాబేగం, కొత్తపల్లి సుప్రియ, పువ్వల రతీదేవి, బిర్రె పార్వతి, అలమూరి భారతి, ఆకుల ముకుందరావు, మున్సిపల్ డీఈ మాధవీలత, సచివాలయ, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

### శెట్టిపేటలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం

**నిడదవోలు రూరల్:** భవన నిర్మాణ కార్మికులంతా ఐక్యంగా కలిసి పని చేసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీస్మకుమార్ సూచించారు. మండలంలోని శెట్టిపేటలో యూనియన్ అధ్యక్షుడు ఖండవల్లి వీరవెంకట్రావు అధ్యక్షతన భవన నిర్మాణ కార్మికుల సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఖండవల్లి దుర్గారావు, పాటంశెట్టి రాజేష్, దిడ్ల నరేష్, విజయ్, రాజారావు, సాయి, చిన్నం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### ఫ్రై డే డ్రై డేపై అవగాహన

**ఉండ్రాజవరం:** ఫ్రైడే డ్రైడేను బాధ్యతగా ప్రతి ఒక్కరూ పాటించాలని, దీనిపై గ్రామస్తులందరికీ అవగాహన కల్పించాలని ఎంపీహెచ్‌ఈవో డి.సుబ్రమణ్యం కోరారు. చివటం గ్రామంలో శుక్రవారం ఆయన పారిశుధ్య కార్యక్రమం పరిశీలించి, సిబ్బందికి, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, డెంగీ, మలేరియా, వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఎం సూర్యకుమారి, ఎంఎల్‌హెచ్‌పీ విజయకుమారి, ఆశాలు లక్ష్మీదేవి, సంధ్యారాణి, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

### వివాహ వేడుకకు హాజరైన మంత్రి రజిని



**నిడదవోలు :** పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆడిటోరియంలో శుక్రవారం రాత్రి జరిగిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి నంగులూరి తరుణ్, మహాలక్ష్మి వివాహ వేడుకకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడుదల రజిని, ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డిలు హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. వీరితోపాటు వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

# ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

**తాళ్లపూడి:** శ్రావణ మాసం మూడో శుక్రవారం పూజలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన తాళ్లపూడిలోని రాజ్యలక్ష్మీ ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. తాళ్లపూడిలోని నవదుర్గాది పరివార సహిత కనకదుర్గమ్మ ఆలయంలో అర్చకులు శివప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. మహిళలు కొత్త చీరలు సమర్పించారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు.

**చాగల్లు:** స్థానిక వల్లికుంటలోని కనకదుర్గమ్మ ఆలయంలోను, ధనలక్ష్మమ్మ ఆలయంలోను, ఊనగట్ల, బ్రాహ్మణగూడెం, మార్కొండపాడు, చిక్కాల, చంద్రవరం తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. లలితా సహస్రనామాలు, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. బ్రాహ్మణగూడెం, చాగల్లు కనకదుర్గమ్మ ఆలయంలోను కుంకుమ పూజలు, అభిషేకాలు చేశారు.

**ఉండ్రాజవరం:** పాలంగిలో కనకదుర్గమ్మ అమ్మవారు ఫల పుష్ప సహిత వనదుర్గ అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి దంపతులు, సర్పంచ్ బొక్క శ్రీనివాసు, భక్తులు దర్శించుకున్నారు. తాడిపర్రు గోగులమ్మ అమ్మవారిని పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు.

**పెరవలి:** అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ గౌరీ వ్రతాలు సామూహికంగా నిర్వహించారు. మండలంలోని కానూరు, కాకరపర్రు, ఖండవల్లి గ్రామాల్లో వేంచేసి యున్న కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో తెల్లవారుజామున 4 గంటల నుండే ప్రత్యేక పూజలు నిర్వహించారు. వందలాది మందితో శ్రావణ వ్రతాలు చేశారు.



అన్నవరప్పాడు వేంకటేశ్వర స్వామి ఆలయంలో వ్రతం చేస్తున్న మహిళలు

**8న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు**

**నిడదవోలు రూరల్:** శ్రావణమాసం పురస్కరించుకుని తిమ్మరాజుపాలెంలో ఉన్న కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయంలో ఈనెల 8న సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం(శివ)శుక్రవారం తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే వరలక్ష్మి వ్రత పూజలకు పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన కోరారు.

### శరవేగంగా అభివృద్ధి పనులు

**చాగల్లు:** ఎస్.ముప్పవరంలో కల్వర్టు, సీసీ రోడ్లు నిర్మాణాలు అభివృద్ధి పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పనులను సర్పంచ్ ముప్పిడి మహాలక్ష్ముడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వంలో మంజూరైన రూ.20 లక్షలు నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్వర్టుల నిర్మాణాలు గ్రామంలో చేపట్టినట్టు ఆయన తెలిపారు. హోంమంత్రి తానేటి వనిత సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేస్తున్నామని మహాలక్ష్ముడు పేర్కొన్నారు.

### పట్టణంలో నాభూమి.. నాదేశం..

**నిడదవోలు :** పట్టణంలో గాంధీబొమ్మ సెంటర్‌లో పట్టణ బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం నాభూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చిటికెడు మట్టి కలశంలో సేకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి సత్యనారాయణ, సింహాద్రి సత్యనారాయణ, నీలం రామారావు, కట్టుంగ అచ్చియ్య, జీవీ రమణ, సింహాద్రి, శ్రీవాణి, నిడమర్తి భాస్కరరావు, మద్దిపాటి సత్యనారాయణ, నీలం మంగతయారు, ఉమమోహనరావు, జి.వెంకటరావు, నరేష్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

### వ్యక్తి అరెస్టు

**కొవ్వూరు:** చాగల్లు గ్రామంలో సారా విక్రయిస్తున్న కేసులో కోడి శ్రీనివాసరావు అనే వ్యక్తిని శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ వీటీవీ సత్యనారాయణ తెలిపారు. నిందితుడి నుంచి రెండు లీటర్ల సారాని స్వాధీనం చేసుకున్నామన్నారు.

### ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

**చాగల్లు:** చాగల్లు తెలగా సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర మహోత్సవాలను నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యాక్షులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు గంద్రోతు సురేంద్రకుమార్ తెలిపారు. స్థానిక తెలగా సంఘం వినాయకుడి గుడి వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో గణపతి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా పందిరి మూహూర్తం చేసి ఉత్సవాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేంద్రకుమార్ మాట్లాడుతూ ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 18వ తేదీ నుంచి 27వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో సంస్కృతిక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ మండలశాఖ గౌరవ అధ్యక్షుడు కొండలరావు, మంగరాజు, వీర్రాజు, సూర్యం, సర్వరాయుడు, సూరిబాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.